రానురాను మనచదువు

# "తిలోత్తమ మాసాలు"

కొండూరి నరసింహం

మనదేశంలో విద్యాభివృద్ధికి చాలా ప్రయత్నాలు జరుగుతున్నట్లు పత్రికలలో వార్తలు. ప్రభుత్వంవారు విచారణ సంఘాలను నియమిస్తున్నారు. అనుభవజ్ఞుల సలహాలను సేకరిస్తున్నారు. పలువురు పలువిధాల ఉపన్యసిస్తున్నారు. రకరకాల పద్ధతులు ప్రవేశపెట్టబడుతున్నాయి. ఎన్ని జరిగినా విద్యార్థికి ఉపకరించడం అనేది సంభవం కావడంలేదు. విద్యార్థి పరీక్షలలో తేలికగా ఉత్తీర్ణుడు కావాలంటూ కొందరి ప్రయత్నం. రెండుమూడు భాషలను విద్యార్థి అభ్యసింపగలగాలని మరికొందరి సదభిప్రాయం. విద్యార్థిసంఘాల ఉద్దేశ్యాలు మాత్రం విద్యార్థి చదవకుండానే సత్పండితుడు కావాలని. ఈ అభిప్రాయాన్ని ఆధునిక రాజకీయవేత్తలు చాలామంది సమర్థిస్తున్నారు.

S.S.L.C. పరీక్షలయినాయి. ప్రశ్న పత్రములు అవకతవకగా ఉన్నాయని కొందరు, విద్యార్థికి ఎనలేని నష్టమువస్తుందని కొందరు లేఖలద్వారా ప్రకటనలు సాగించారు. తెనుగు ప్రశ్నల పత్రము చాలా దారుణంగా ఉందని ఒక తెలుగు పండితుని ఘోష. ప్రశ్నలకీయబడిన మార్కులు నిపుణతతో నిర్ణయింపబడలేదని వీరి ప్రచారము. అదేమిటి? అసలు ఏ ప్రశ్నకెంత సమాధానము వ్రాయాలో నేటి విద్యార్థులకు తెలియనే తెలియదని మాశర్మ వాదం. ఏదిఏమైనా విద్యార్థితరఫున వాదిస్తే ఘనత అనిఅరుణకుమార్ అంటారు. రైతులతరఫున వాదిస్తే నాయకుడు కాగలడనే సూత్రమే దీనికీ అనువర్తిందని మా బావ సిద్ధాంతం...

ప్రశ్న పత్రములు, సమాధానములు సావధానంగా పరిశీలిస్తే నేటి విద్యాపద్ధతిలో ఉండే బలహీనత, విద్యార్థిలో ఉండే అభ్యుదయ గమనము బోధపడతాయి, విద్యార్థులు కాపీలు చేస్తున్నారన్న కాకిగోల మాట అటుంచండి. మా స్కూలులో కాపీలుజరగవండిఅని ప్రతిప్రధానోపాధ్యాయులుఢంకాబజాయిస్తూనే ఉంటారు. వాచర్సుగా వెళ్ళినవారు దుర్యోధనుడు మయసభలో పొందిన గౌరవాలను పొంది చక్కావస్తూనే ఉంటారు. దబాయించి పుస్తకాలలో చూసే వ్రాశానురా అంటూ అనేకమంది విద్యార్థులు రొమ్ము విరుస్తూనే ఉంటారు... సరే...

ఇంతబాహాటంగా కాపీలుజరిగే యీ యుగములో విద్యార్థులువ్రాసే సమాధానాలు ఎంత వింతగానో ఉంటాయి. ఎదుటి విద్యార్థినిచూచి వ్రాసే విద్యార్థి, ఎదుటివాని గీతను, చుక్కను, కొట్టివేతను, సహా బదులుపుచ్చుకుంటాడు. బైటి నుండివచ్చే సమాధానపత్రాలకు (ఇవి రాళ్ళతో సహా ఎగిరివస్తాయిలెండి) ఎదురుచూచే విద్యార్థి వచ్చిన సమాధానాన్ని పొరపాటున మరొక రూపంలో వచ్చినా ఏదోఒకప్రశ్నకు సరిపెట్టుకుంటాడు. ఒకగదిలోనున్న పదిమంది విద్యార్థులూ వాచరునే నిలవేసి సమాధానాలు చెప్పించుకొనే అభ్యుదయ విధానంకూడా అమలులోకి వచ్చేసింది. ఈ సంవత్సరం అతిచాకచక్యంగా నేను డ్రిల్లుమాస్టరుని నాకేమి తెలియదని దాటుకువచ్చిన ఒక బి. యి. డి. గారికి దేహశుద్ధికూడా జరిగింది. సమాధానాలుచెప్పి సరసంగా పైకివచ్చిన ఉపాధ్యాయులకు సిరానీళ్ళతో వసంతోత్సవమూ జరిగింది. ఒక్కఉపాధ్యాయుడూ పైకి చెప్పుకోడానికి సిగ్గుపడతాడుగాని ఇలాటి సన్మానాలనందనివారరుదు. గురుశిష్యులమధ్య ఇలాటి బాంధవ్యగౌరవాలకు స్వస్తిచెప్పడం జరిగితే యుగంమారిందని చెప్పవచ్చు.

ప్రశ్నలకు సమాధానాలు వ్రాయడంలోగల విద్యార్థుల మానసికస్థితులు నేటినాయకమ్మన్యుల హృదయాలకుమల్లేనే అర్థంకాకుండా పోతున్నాయి. అది సాహసమో, చేతకానితనమో, మాయకత్వమో, అమాయకత్వమో, మనంనిర్ణయించ వీలులేని సమాధానాలు వస్తున్నాయి. Master అన్న పదానికి other gender వ్రాయ

మంటే Pantulamma అని వ్రాశాడొక విద్యార్థి. బొగ్గు ఎక్కడ దొరుకును? అంటే గనులలో అని సమాధానం. గాంధీగారి నిర్మాణ కార్యక్రమమునకుగల సాధనములేవి? అని సాంఘిక విజ్ఞాన శాస్త్రంవారి ప్రశ్న. రెండతిస్తుల మేడ, చుట్టూ ప్రాకారము, లోన దివ్యమైనతోట, మేడలో ఒక తూగుటుయ్యాల, పదిహేనేండ్ల వయస్సుగల యువతి... అని విద్యార్థి వివరణ. ఇలాటివెన్నో ఉపాధ్యాయుల కనుభవాలే. ఇట్టివానిని సంస్కరించడమెలాగో తెలియకే గురు తపస్సులు చేస్తున్నారు.

కవులచరిత్ర, కథావివరములు, దేశకాల పరిస్థితులు వగైరాతో విద్యార్థికేమీ సంబంధం లేకుండాపోయింది. వచ్చి వెళ్ళిన సినీమాలు రాబోయే చిత్రాలవార్తలు, తారల జీవితాల మీద విమర్శలు, మాత్రమే వారికి నిత్యస్మరణీయాలు. క్రమశిక్షణ కావాలని చెప్పే గురువు వారి దృష్టికి కాలాంతకరుడు. వారి స్వేచ్ఛను సమర్థించే గురువు వారికి అభ్యుదయావతారము......ఇక యేమిటి ముక్తిమార్గము?

మొన్నటి ఎస్. ఎస్. ఎల్. సి. తెనుగు ప్రశ్నపత్రములో అచ్చుతప్పులున్నాయి. రెండుమూడు అచ్చుతప్పులతో విద్యార్థి భవిష్యత్తుకు చాలా భంగం కల్గుతుంది, ప్రభుత్వం న్యాయం చెయ్యాలంటూ ఒకరి హెచ్చరిక. మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు యోగ్యంగా వ్రాయబడితే ఈ తప్పులవల్ల వచ్చే నష్టం అంత లెక్కలోనిది కాదు. అయినా ఒక్కమార్కు దగ్గరకూడా విద్యార్థికి అన్యాయం జరగకూడదని మావాళ్ళ తలంపు. నిజమే అచ్చుతప్పుల పాఠ్యగ్రంథాలే అప్రువయి కూచుంటున్నాయి. ప్రశ్నపత్రాల సంగతి కేమంటాము... చిన్న అచ్చుతప్పును సవరించుకొనే శక్తి విద్యార్థికుండదా అన్నాడు మా సంగయ్య "కలధౌతము" అన్న శబ్దము "కలధతము" అని పడింది. అది విద్యార్థే సంస్కరించుకోవాలంటే చదివిన పాఠ్యగ్రంథములోని శబ్దాలన్నీ కరతలామలక మవాలిగదా! అదే ఉన్ననాడు ఈ సమస్యే లేదు. పాఠ్యగ్రంథాలు చదివే రోజులుపోయి నోట్సులు మాత్రమే చదివేరోజులివి.

ఈ సంవత్సరపు తెనుగు రెండవ పేపరులో "సుందోపసుందుల" పద్యకథ యీయబడింది. దానిని కథగా వచనంలో వ్రాయాలి. | ఆ పద్యాలను అర్థం చేసికొనగల శక్తి విద్యార్థికున్నదా అంటే తంటాయే. అందలి పురాణకథ కూడా చాలామందికి అపరిచితమే. దీనికి విద్యార్థులు ఎంతటి తమాషాగా వచనానువాద మిస్తారో, ఇచ్చారో, వాకబుచేసినవారికి బోధపడుతుంది. సుందోపసుందుల మరణానికి కారణమైన వ్యక్తి తిలోత్తమ అనే స్త్రీయో తిలోత్తముడు అనే పురుషుడో చాలామందికి తెలియలేదు. ఇది పురాణకథలు తెలియని లోపమందామా? తిలోత్తమ సినీమాకథ కూడా బోధపడని దోషమందామా? పద్యాలు, కథ కొత్తవే అనుకుందాము. అయినా జాగ్రత్తగా చదివితే విషయం బోధపడుతుందే. పద్యాలు చదవడంలోకూడా విద్యార్థికి బలం లేదందామా?

ఈ పద్యాలు సులభంగా ఉండడంచేతనే కాబోలు పరీక్షాధికారులు లఘుటీకను లఘువుగానే యిచ్చారు. ఇక విద్యార్థులు ఈ కథమీద చేసిన సాము చూస్తే జాలిపుడుతుంది. కమలగర్భుడంటే విష్ణువని కొందరు, కృష్ణుడని కొందరు. కమలగర్భుడే అని కొందరూ, దేవేంద్రుడని కొందరు అర్థం వ్రాశారు. తిలోత్తమ గృహోపవనంబున నుండజూచిన దైత్యులు సుందోపసుందులకీ విషయాన్ని వివరించిన పద్యాం ఎంత విచిత్రంగానో వివరింపబడిందని తెల్సింది.

"ఇదియొక యింతి యెవ్వతయొ యివ్వన
మంతయు యౌవనంబునన్
గదురగఁ బెక్కురాగములు గైకొనిపాడుచు
మ్రానిమీఁదటన్
చెదరిన లేటి చందమునఁ జిమ్మటిఁ బొందగఁ
జూచుచున్నదా
సుదతి వరించినన్ సుఖము సుబ్బఁ జాలు
గాదె యేరికిన్"

ఇది యవతో చెట్టుమీద కూర్చుని పెక్కురాగములు పాడుచు పెనిమిటిని పొందగోరుచున్నది. సుబ్బన యనువానినిది వరించినదిలా ఉన్నది... వంటి భావములీపద్యంలోనుండి బయలుదేరాయి. సుందోపసుందులు తిలోత్తమచుట్టూచేరి ఆమెపై రాయుచు నాకు ప్రియ, నాకు చెలియ అని మాట్లాడారని కొందరివివరణ. "ఆమెపైరాయుట"

యనే స్వతంత్ర భావనకూ మనమానందించవలసిందే. "రంజితపాణి పల్లవము రాయుడునా" అనే పాపయ్యశాస్త్రిగారి ఘంటసాల గానాన్ని పదేపదే ఆలపించే విద్యార్థికి ఈ ముదురుమాటలు పుట్టుటలో వింతలేదు. ఈ సుందోప సుందుల కథలో మరియొక విచిత్రం చెబుతాను. సుందోప సుందులు వనమధ్యమున తిలోత్తమను "కనియక్కామినీమణి విలాసముల కచ్చెరు వొంది" అని యున్నది. కర్మకాలి "విలాస" అనే పదములో "లా"సరిగా అచ్చుకాలేదు. "మీసముల" అని విద్యార్థులు చదువుకున్నారు. తిలోత్తమకు మీసాలేమిటి? అనే సందేహము 100కి 50 మంది విద్యార్థులకు తోచనేలేదు. ఆ రాక్షసులామె మీసముల కాశ్చర్యపడిరి అనే వ్రాశారన్నమాట. కృష్ణునికి మీసాలున్నాయా? అనేది పెద్దలలో చాలా తుఫానులు లేపగా ఈనాడు "తిలోత్తమ మీసాలు" సమస్య అయినాయి...

"పోరిపోరి యొక్క వూపున నిద్దఱు
నొకసారి గదల నిక్కివేయ"

అనే పద్యపాదంపై మీసాలకు పదును పెట్టేటట్లు చాలమంది అన్వయించి సర్దాగా వివరణ వ్రాయడంలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని వ్రాయలేము. వూపు-నిక్కివేయ, అనే పదాలు తిలోత్తమ సుందోపసుందుల నాకర్షించినట్లే విద్యార్థుల నాకర్షించాయి.

ప్రశ్నలకు సరియైన సమాధానాలు వ్రాయడంలో నేటి విద్యార్థులు చూపించే విధానాలు పరిశీలిస్తే విద్యను సంస్కరించాలని కృషిచేసే నేటి పెద్దలకు ఉత్తమమార్గాలు ద్యోతకమవుతాయని హెచ్చరిస్తూ త్వరగా ఉత్తమవిద్య ప్రసాదింపబడే విధానం నవ్యాంధ్రరాష్ట్రంలో ప్రసాదింపబడుతుందని ఆశిస్తున్నాను.

---

క థా ని క

# వ్యర్థంలో అర్థోదయం

"శార్వరి"

ప్రతివారూ "ఉద్యోగం పురుషలక్షణం" అని అంటారు అలాగని నే నెప్పుడూ అనుకోలేదు. కాని నాకున్న ఆశయాలు బహుకొద్ది. ఆశయాలు లేకుండా మనుషులు బ్రతకగలరో లేదో కూడా నాకు తెలియనివిషయాల్లో ఒకటి. ఆ విషయాన్నిగురించి నే నెన్నడూ తీవ్రంగా ఆలోచించలేదు. అసలు ఆలోచించే అవకాశం వ్యవధి, నాకు ఏర్పడలేదు. ఎందువల్లనంటే మనిషిఆలోచించటం ఆశయాల్నిగురించి యోచించటం పనిలేనప్పుడు విశ్రాంతిగా వున్నప్పుడు జరుగుతుంది. ఉద్యోగం, సద్యోగం లేనప్పుడే ఆలోచనలు విపరీతంగా కలుగుతాయి. నాకు ఏ విషయాన్నిగురించి ఆలోచించే తీరికా లేదు.

ఉద్యోగంలోచేరి కొన్ని సంవత్సరాలయింది. గవర్నమెంటు నౌకరీ కాదు, బడిపంతులు వుద్యోగమూ కాదు నాది. వ్యాపారసంస్థలో ఒక గుమాస్తాని నేను. ఇన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసినతరవాత ఒక్కసారి వెనక్కుతిరిగి చూచుకుంటే ఏమీ అవుపించటంలేదు. నే సంపాదించింది ఏముంది? డబ్బు, కీర్తి, గౌరవం ఈ మాటలో ఏదీ నే సాధించలేకపోయ్యాను. పెద్ద ఉద్యోగం అయితే నాది, అలానే సంపాదించివుండేవాణ్ణి కాని గుమాస్తానిగా నేను. అందులోనూ సామాన్య గుమాస్తాని.

కొంతకాలం నన్నుగురించి ఆలోచించుకోవటమే మర్చిపోయాను. అనవసరం అప్రస్తుతం అనుకొని. గతాన్నిగురించి ఆలోచించుకుంటే దిగులు, విచారం తప్ప ఏం మిగులుతాయి? నేను సాధించింది ఏమీలేదు. ఎవరికీ ఏ ఉపకారమూ చేసి ఎరగను. వ్యర్థంగా జీవిస్తున్నందుకు ఇప్పుడు విచారం కలుగుతోంది. ఇప్పుడు చేయగలిగింది మాత్రం ఏముంది?

ఒకసారి మా ఆవిడతో అన్నాను.